క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

ఆత్మకూర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం ఆత్మకూర్‌కు వస్తున్నట్లు తహసీల్దార్ రాజు, కాంగ్రెస్ నాయకులు పరమేష్, రహ్మతుల్లా, శ్రీను, తులసీరాజ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 76 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



వనపర్తి: గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా కేంద్రం, మండలం నుంచి అత్యధిక ఓట్లు బీజేపీకి వచ్చాయని, అందుకు కృషి చేసిన పట్టణ అధ్యక్షుడు బచ్చురామును బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ శాలువాతో సత్కరించారు. బుధవారం స్థానిక లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన పదాధికారుల సమావేశానికి ఆయన మాజీ ఎంపీ రాములుతో కలిసి హాజరయ్యారు. ప్రధానమంత్రి మోదీపై, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను విశ్వసించి బీజేపీకి ఓట్లు వేసిన ప్రజల సంక్షేమ కోసం నిత్యం పోరాడుతూ.. ప్రజల్లో ఉండేందుకు కార్యచరణతో ముందుకు వస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన బుక్కు రాముడు, మణెమ్మ దంపతులు వారి కుమారుడు డాక్టర్ గోపికృష్ణ సహకారంతో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం హనుమంతు, విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్, ఉపాధ్యాయులతో కలిసి దాతలు బుక్క రాముడు, మనెమ్మలను శాలువా, పూలమాలతో సన్మానించారు. డాక్టర్ గోపికృష్ణ తమ పాఠశాలలో చదువుకొని డాక్టర్‌గా గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ తను చదువుకున్న పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అండగా ఉండడంపై హర్షం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కుమ్మరి నాగన్న, గ్రామస్తులు సురేష్, వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్ నాయుడు, రాఘవేందర్, బుక్క ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన మత్స్యకార సంఘం నాయకుడు యాపచెట్టు నరసింహ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ నాయకులు పగిడాల శ్రీనివాసులు స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన తంబళ్ల అలివేల దశదిన కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాముయాదవ్, నజీర్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



పెబ్బేరు రూరల్: ఈత, తాటి చెట్లను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ కోరారు. ఆయన ఎక్సైజ్ ఎస్‌ఐ గోవర్ధన్‌తో కలిసి మండలంలోని రంగాపురంలో ఘటన స్థలంలో ధ్వంసం చేసిన ఈత, తాటి చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికులు తమ కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని రాజశేఖర్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు వేణుగౌడ్, రాజుగౌడ్, వెంకటస్వామిగౌడ్, సిబ్బంది బీరన్న, విష్ణు, చంద్రశేఖర్, షరీఫ్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఈఈకి ఫిర్యాదు

మండలంలోని రంగాపురం శివారులో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పాటు కాల్వ ఒడ్డుకు ఉన్న ఈత చెట్లను తొలగించి కాల్వను పూర్తిగా చదును చేసి పంట పొలంలో కలుపుకొన్నారు. దీంతో కాల్వ కింద ఉన్న కుమ్మరికుంట చెరువుకు నీరు రాక నిండని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం చెరువు కింది ఆయకట్టు రైతులు పెబ్బేరులోని భీమా ఈఈ కేశవరావుకి ఫిర్యాదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటికి తంటాలు



అంకూర్ సమీపంలోని మినీ లిఫ్ట్ వద్ద మరమ్మతుకు గురైన మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

- పామిరెడ్డిపల్లిలో రెండు, మూడు నెలలుగా నీటి సరఫరాలో అంతరాయం
- అడుగంటిన సోర్స్ బోర్లు
- చోద్యం చూస్తున్న భగీరథ అధికారులు

గ్రామ వివరాలు		
ఇళ్లు	జనాభా	నల్లా కనెక్షన్లు
545	2,450	620
వాటర్ ట్యాంకులు 4		

కొత్తకోట రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఏటా రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో రెండు, మూడు నెలలుగా భగీరథ తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనికి తోడు సోర్స్ బోర్లు సైతం అడుగంటడంతో గ్రామంలో ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పాలన అమలు కావడంతో సమస్యపై ఎవరి ప్రశ్నించాలో కూడా తెలియడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో స్నానాలు చేయడం, బట్టలు ఉతుక్కోవడం వంటివన్నీ వ్యవసాయ బోర్ల వద్దే చేస్తున్నామని అసహనం వ్యక్తం చేశారు.

అందని గ్రావిటీ నీరు

గతంలో వనపర్తి మండలంలోని అంకూరు వద్ద ఏర్పాటు చేసిన మినీ లిఫ్ట్ ద్వారా నీటి పంప్ చేస్తుండడంతో గ్రామంలోని అన్ని ట్యాంకులు నింపి, నీటిని కొళాయిలకు వదిలేవారు. కానీ ప్రస్తుతం అక్కడ మోటారు రిపేరు కావడంతో నేరుగా గ్రావిటీ ద్వారా నీటి తరలిస్తుండడంతో ట్యాంకులకు నీరు ఎక్కడం లేదని లైన్‌మెన్లు తెలిపారు. ప్రజా అవసరాల కోసం రోజుకు సుమారు 2.3 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా ప్రస్తుతం 50వేల లీటర్లకు మించి అందడం లేదు. సమస్యను ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే ఏఈ, ఇతర సిబ్బంది నీటి సరఫరాలో ఇబ్బందులు ఏమిలేవని చెప్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోజూ నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామన్నారు.

తాగునీరు అందడం లేదు..



గ్రామంలో నెలల తరబడి భగీరథ నీరు అందడం లేదు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడంతో ప్రజలు ఎవరిని అడగాలో తెలియని అయోమయంలో ఉన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్తులు గత పాలక మండలి సభ్యులనే నిలదీస్తున్నారు. తాగునీటి సరఫరా కాకపోవడంతో గ్రామంలో తిరగలేకపోతున్నాం. ఇప్పటికైనా భగీరథ అధికారులు నీరు అందించాలి.

– సిద్ధయ్య, తాజా మాజీ సర్పంచ్

భగీరథ అధికారులకు వివరించాం



గ్రామంలో నీటి ఎద్దడి ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. అన్ని కాలనీల్లో పర్యటించి పైపు లైన్ లీకేజీలను సరిచేశాం. కేవలం గ్రావిటీ ద్వారానే నీటి సరఫరా చేస్తామని భగీరథ అధికారులు చెబుతున్నారు. దీంతో ట్యాంకులకు నీరు ఎక్కడం లేదు. వనపర్తి మండలంలోని అంకూరు వద్ద ఉన్న మినీ లిఫ్ట్ నుంచి నీటిని పంప్ చేస్తే గ్రామానికి సరిపడా నీటిని అందించొచ్చు. సమస్యను మరోమారు భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– శ్రీరాంరెడ్డి, ప్రత్యేకాధికారి

వారంలో పరిష్కరిస్తాం

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. అంకూర్ సమీపంలో ఉన్న మినీ లిఫ్ట్ నుంచి నీటిని పంప్ చేసి గ్రామంలోని అన్ని ట్యాంకులు నిండేలా చూస్తాం. అక్కడ మోటార్లు రిపేర్ కావడంతో పంపింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాటికి మరమ్మతులు చేసి వారంలో సమస్య పరిష్కరిస్తాం.

– హరీష్, భగీరథ ఏఈ

ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది నిర్వాకం

- ప్రసవం చేసినందుకు మహిళతో డబ్బులు డిమాండ్ చేసిన వైనం
- వైద్యాధికారికి ఫిర్యాదు చేసిన బాధితులు



సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆందోళన చేస్తున్న బాధితులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేయించుకోవడానికి వచ్చే గర్భిణుల నుంచి సిబ్బంది డబ్బులు డిమాండ్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రానికి చెందిన ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన ఈడగొట్టి కృష్ణవేణికి మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే వారు గ్రామంలోని ఆశాకార్యకర్త ఇందిరకు సమాచారం ఇచ్చి సాయం కోరారు. ఆమె హైదరాబాద్‌లో ఉండటంతో గర్భిణిని గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. వెంటనే వారు అక్కడికి తీసుకెళ్లగా.. బుధవారం ఉదయం 3 గంటల సమయంలో కాన్పు సజావుగా జరిగింది. తెల్లవారిన తరువాత ఇంటి వెళ్తామని వారు చెప్పడంతో అక్కడ ఉన్న కొందరు సిబ్బంది రూ.3 వేలు ఇవ్వాలని, లేకుంటే డెలివరీ సర్టిఫికెట్ గాని, పాప బర్త్ సర్టిఫికెట్ గాని ఇవ్వమని బెదిరించారు. డబ్బులు లేకపోవడంతో వారు ఆశాకార్యకర్త ఇందిరకు ఫోన్ చేశారు. ఆమె చెప్పినా కూడా వినకపోగా రాత్రంతా కష్టపడి నిద్ర లేకుండా కాన్పు చేశాం.. ఎందుకు ఇవ్వరు అంటూ దూర్భాషలాడారు. తప్పనిసరి పరిస్థితుల్లో రూ.1,500 సిబ్బందికి ఇచ్చి వెళ్లిపోయారు. ఈ విషయం తెలియడంతో బుధవారం ఉదయం గ్రామానికి చెందిన ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు చేరుకుని అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. నిరుపేదల కోసం ప్రభుత్వం ఆస్పత్రి ఏర్పాటు చేస్తే రోగుల నుంచి మీరు రూ.వేలు డిమాండ్ చేస్తారా అంటూ ప్రశ్నించారు. అనంతరం బాధితులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకున్న సిబ్బందిపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ విషయమై ఆస్పత్రి వైద్యాధికారి పుల్లారెడ్డిని వివరణ కోరగా.. ఫిర్యాదును పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

విధుల్లో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఈఎస్ కార్యాలయం

వనపర్తి: సమీకృత కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారుల సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బుధవారం ఈ విషయమై సాక్షి విజిట్ చేయగా.. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటినా.. ఒక కానిస్టేబుల్, మరో ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ మినహా.. ఈఎస్ కుర్చీతో సహా అన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. అక్కడ ఉన్న వారిని మిగితా అధికారులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించగా.. క్షేత్ర పరిశీలనకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ విషయమై వివరణ కోసం ఈఎస్ ప్రభు వినయ్‌ని ఫోన్‌లో ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

పైపులైన్ మరమ్మతులో జాప్యం



మరమ్మతులు పూర్తి కాని తాగునీటి పైపులైన్

అమరచింత: పట్టణంలోని కమ్మరి వీధితో పాటు పదోవార్డుకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వెంకటేష్ టీ హోటల్ సమీపంలో ప్రధాన రహదారికి పక్కన లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌కో అధికారులు కొత్త విద్యుత్ లైన్ కోసం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడానికి డ్రిల్లింగ్ చేస్తుండగా మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ పగిలింది. దీంతో తాగునీరు వృథాగా పారుతుండటంతో పైపులైన్ మరమ్మతు కోసం ఐదు రోజుల కిత్రం గుంత తవ్వారు. పగిలిన పైపులైన్‌కు మరమ్మతు చేసిన లీకేజీ ఏర్పడుతుండటంతో తాగునీటిని ఆయా కాలనీలకు అందట్లేదు. హైస్కూల్‌లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సైతం నీటితో నింపలేకపోతున్నారు. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వంట ఏజెన్సీ మహిళలు తాగునీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిపివేస్తుండటంతో బీసీ కాలనీ ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందట్లేదు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మరమ్మతు పనులు పూర్తి స్థాయిలో చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ, ఆలయ స్థలాలు అన్యాక్రాంతం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్

ఆత్మకూర్: పట్టణంలో లేఅవుట్ల ద్వారా ప్రభుత్వానికి కేటాయించిన 400లకుపైగా 10 శాతం ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని, దీంతో దళారులు రూ.5 కోట్లకు పైగా అక్రమంగా అర్జించారని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి తహసీల్దార్ రాజు, మున్సిపల్ కమిషనర్ నాగరాజులతో వేర్వేరుగా సమావేశమై అన్యాక్రాంతమైన భూముల విషయంపై ఫిర్యాదు చేసి నెల రోజులు అవుతున్నా బేఖాతర్ చేస్తున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 44 ఎకరాల్లో నాలుగు ఎకరాలకు పైగా స్థలం కబ్జా అయిందని, ఆలయానికి సంబంధించిన భూమిలో తామే ముళ్లపొదలను తొలగిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే అక్రమ కట్టడాలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడతామన్నారు. పూర్తి ఆధారాలతో జిల్లా కలెక్టర్, కమిషనర్, తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐ, విజిలెన్స్ అధికారులకు ఇదివరకే వినతిపత్రాలు అందించామన్నారు. కబ్జాకోరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

త్వరలోనే చర్యలు

ఆలయాలకు సంబంధించిన, చెరువు శిఖం భూము లు ఇద వరకే పరిశీలించాం. బాధ్యులకు నోటీసులు అందించామని, త్వరలోనే పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజు హామీనిచ్చారు. అలాగే కమిషనర్ నాగరాజు మాట్లాడుతు మున్సిపాలిటీకి సంబంధించిన 10శాతం ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైన విషయమై కాంగ్రెస్ నా యకుల ఫిర్యాదుతో చర్యలు చేపడుతున్నామన్నారు. ఈమేరకు టౌన్‌ప్లానర్ సుధాకర్, మున్సిపాలిటీ అధికారులు 10 శాతం ప్లాట్లలో అక్రమ నిర్మానాలు, కబ్జాకు గురైన స్థలాలను పరిశీలించినట్లు వివరించారు. ఉన్నత స్థాయి అధికారులకు ఆదేశాల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీగా ఉన్నప్పుడు వెంచర్లు చేసిన వారితో 10 శాతం స్థలాలను మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్లు చేయించుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, తులసీరాజ్‌యాదవ్ ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



శ్రీరంగాపురంలో జెండా ఎగురవేస్తున్న మత్స్యకారులు

వనపర్తి టౌన్: జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జిల్లా ఫిషరీస్ చైర్మన్ నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ నాయకులతో కలిసి చేపల రైతులను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నందిమల్ల యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో ముదిరాజులకు మత్స్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సహకారంతో మత్స్య కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి, మత్స్య కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బి.కృష్ణ, కోట్ల రవి, కమ్మర్‌మియా, చీర్ల జనార్దన్, చెన్నరాములు, రాగి వేణు, కోళ్ల వెంకటేష్, నాగరాజు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పెబ్బేరు, శ్రీరంగాపురం మండల కేంద్రాల్లో మత్స్య సంఘం నాయకులు బుధవారం మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరంగాపురంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు స్వాపరి వెంకటయ్య జెండా ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ పెబ్బేరులో మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించి, సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృపాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఆశన్న, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యకారులు వెంకటయ్య, కృష్ణయ్య, మేకలి రఘు, నరసింహ, నరేష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు అధికారులు కనీస వసతులు కల్పించకపోగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మండిపడ్డారు. బుధవారం ఆయన పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఆవరణలో చెత్తచెదారం, పెంట దిబ్బలు ఉండడంతో పాఠశాలలోని విషసర్పాలు సంచరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్లు పాఠశాలను సందర్శించి అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలన్నారు.

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్



బొల్లారంలో పదోన్నతిపై వెళ్తున్న చంద్రారెడ్డిని సన్మానిస్తున్న సుదర్శన్‌రెడ్డి



సోళీపురం ఉన్నత పాఠశాలలో..



జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మాధవి, ఉమాదేవి, కృష్ణానాయక్, బుచ్చారెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో పదోన్నతిపై వేరే పాఠశాలకు వెళ్లారు. వారి సేవలను కొనియాడుతూ బుధవారం హెచ్‌ఎం వీరశేఖరాచారి, ఉపాధ్యాయ బృందం శాలువా, పూలమాలలతో సన్మానించారు.

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడితో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గ్రామంలోని పలు పాఠశాలలో 18 ఏళ్లుగా ఎస్‌జీటీ టీచర్‌గా పనిచేసిన తూంకుంట చంద్రారెడ్డి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై సంగినేనిపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. అలాగే నాగర్లబండతండా గోవర్ధన్, వంటిమిట్ట తండా జయమ్మ బొల్లారం ప్రాథమిక పాఠశాలలోనే పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ, మాజీ ఎంపీటీసీ కవిత, సుశీలమ్మ, సుజాత, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పాపయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను, పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను గురువారం ఉమెన్స్ రైట్స్ అసోసియేషన్ వనపర్తి జిల్లా చైర్మన్ కొన్నూరు బాల్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. పాఠశాల నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా.. ఆరుగురు ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



పెబ్బేరులో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద



మదనాపురంలో..

అమరచింత: కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లను పరిష్కరించాలని తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, ఆశా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు

పాన్‌గల్: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూర్యవంశం రాము, అర్జునయ్య, చంద్రశేఖర్, ఎల్లస్వామి, నాగన్న, శేషన్న, శారద, అలివేల, తిరుపతమ్మ, మాధవి, సుజాత పాల్గొన్నారు.

మదనాపురం: కేంద్రంలో ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలినిక్సన్, అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అబ్రహం లింకన్ అందజేశారు. కార్యక్రమంలో అరుణ, జిలేఖాబేగం, సలీమా, విజయలక్ష్మి, తార, గంగ, భాగ్యరాణి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీ ఉద్యోగులు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

వీపనగండ్ల: అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, లక్ష్మి, మాధవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మద్దిలేటి, మండల కమిటీ నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అరుణ, ఇందిర, పుష్ప, దాసు, సావిత్రి, దేవకమ్మ, సరళ, ఈశ్వరమ్మ, లక్ష్మయ్య, కృష్ణయ్య, విష్ణు ఉన్నారు.

కొత్తకోట రూరల్: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, వనజకుమారి, సువర్ణ, అలివేల, నిర్మల, ప్రసన్న తదితరులు ఉన్నారు.

గోపాల్‌పేట: కేంద్రప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఐకేపీ వీఓలు, భోజన కార్మికులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు చిట్టెమ్మ, ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు లత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎన్‌రమేష్, బుచ్చన్న, సంధ్య, రాణి, విజయమ్మ, సత్యమ్మ, నవనీత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.